సాక్షి
కాకినాడ

శుక్రవారం । 27 । జనవరి । 2023



శ్రామికా మేలుకో.. బీమా చేసుకో..


కాకినాడ సిటీ: రెక్కల కష్టంతో జీవించే అసంఘటిత, సంఘటిత రంగాల కార్మికులకు అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-శ్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టాయి. 8లో..



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గురువారం నార్ని వీర వెంకటేష్ (ఏలూరు) రూ.1,11,116,మేడిశెట్టి శ్రీనివాసరావు (తాడేపల్లిగూడెం) రూ.1,08,000 విరాళంగా ఆలయ కార్యాలయంలో అందజేశారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,200 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2300, మధ్య డెల్టాకు 1700, పశ్చిమ డెల్టాకు 4200 క్యూసెక్కుల నీటిని వదిలారు.



జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

సమష్టికృషితో ప్రగతిపథం

- పోలీస్ పెరేడ్ మైదానంలో ఘనంగా గణతంత్ర దిన వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్
- ప్రభుత్వ పథకాలను వివరించిన కృతికాశుక్లా
- ఉత్తమ సేవలందించి అధికారులకు పురస్కారాలు

కాకినాడ సిటీ: అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ప్రజలకు పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా స్థాయి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంప్రదాయ గార్డ్ ఆఫ్ ఆనర్, మార్చ్‌ఫాస్ట్ అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె ప్రసంగించారు. జాతి, కుల, మత, ప్రాంత భావనలు లేకుండా విధులు, బాధ్యతలను అందరూ అంకితభావంతో నిర్వర్తించాలని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వివిధ రంగాల ప్రగతిని ప్రజలకు వివరించారు.

కలెక్టర్ ప్రస్తావించిన అంశాలు

- మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది ఇప్పటి వరకు 5.98 లక్షల మందికి వేతన ఉపాధి కల్పించారు. వీరికి రూ. 234.11 సగటున దినసరి వేతనంతో 54 లక్షల పని దినాలు కల్పించాం. ఈ పథకం అనుసంధానంతో ఇప్పటివరకు 263 గ్రామ సచివాలయాలు, 114 రైతు భరోసా కేంద్రాలు, 63 వెల్‌నెస్ సెంటర్లు నిర్మించారు.
- వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా జిల్లాలో 16 కేటగిరీల కింద 2,76,417 మంది పింఛన్‌దారులకు రూ.76 కోట్ల మొత్తాన్ని ప్రతి నెలా 1వ తేదీన వారి ఇంటి వద్దే పంపిణీ చేస్తున్నారు.
- స్వయం సహాయక సంఘాల మహిళలను పెట్టుబడిదారులుగా ప్రోత్సహించి, యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ, తొండంగి మండలం ఎ. కొత్తపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టులు విజయపథంలో పయనిస్తున్నాయి. కుట్టు శిక్షణ పొందిన మహిళా సంఘాల సభ్యులు దుస్తుల తయారీ రంగంలో ఆర్థికంగా ఎగిగేందుకు సామర్లకోట టీటీడీసీలో వస్త్ర బ్రాండ్‌తో టైలరింగ్ యూనిట్‌ను ఇటీవలే ప్రారంభించారు.
- వైఎస్సార్ చేయూత పథకం కింద 1,02,335 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల మహిళలకు మూడో విడతగా రూ.194 కోట్లు ఆర్థిక సహాయాన్ని వారి ఖాతాలకు జమ చేశారు.
- నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద జిల్లాలో 64,276 గృహాల నిర్మాణం ప్రారంభమైంది. వీటిలో 10,587 గృహాలు పూర్తయ్యాయి. మరో 53,689 గృహాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి.
- పేదలకు ఇంటి వద్దే వైద్య సేవలు అందించే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని జిల్లాలో విజయవంతంగా అమలవుతోంది. గడచిన 3 నెలల కాలంలో 1.33 లక్షల మంది ఈ సేవలను వినియోగించుకున్నారు.
- ఈ ఏడాది జగనన్న విద్యాదీవెన పథకం కింద 48.251 మంది ఎస్సీ, బీసీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు రూ.90.14 కోట్లు వారి తల్లుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది.
- వికాస సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయాల ద్వారా నిర్వహించిన 48 జాబ్ మేళాలలో 10,124 మంది యువతకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ నియామకాలు లభించాయి.
- ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం ద్వారా అక్రమ సారా తయారీ, రవాణా, అమ్మకాలకు పాల్పడుతున్న కుటుంబాలను కౌన్సెలింగ్ ద్వారా మంచి మార్గంలోకి తెచ్చి పునరావాసం కల్పిస్తున్నారు.
- జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా రోవర్లు, డ్రోన్లు వంటి అత్యాధునిక టెక్నాలజీ సహాయంతో 11 మండలల్లాలోని 128 గ్రామాల్లో సమగ్ర సర్వే పూర్తి చేశారు. ఇప్పటి వరకు 46,380 భూహక్కు పత్రాలను రైతులకు అందించారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా



కవాతు చేస్తున్న జిల్లా పోలీసులు

రైతులకు అండగా..

జిల్లాలో ఈ ఏడాది వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాల ద్వారా 1,57,914 మంది రైతులకు రూ.186.71 కోట్ల పెట్టుబడి సహాయం అందించినట్లు కలెక్టర్ తెలిపారు. చేపల వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయిన 21,394 మంది మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా రూ. 21.40 కోట్లు ఆర్థిక సహాయం పంపిణీ చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా గత ఖరీఫ్‌లో పండించిన 2.47 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రూ. 506 కోట్ల మొత్తాన్ని 51,337 మంది రైతుల ఖాతాలకు జమ చేశామని వివరించారు.



కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

గడప గడపకూ పనులకు పెద్దపీట

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద గుర్తించిన 924 ప్రజావసర పనులను రూ.31.40 కోట్ల నిధులతో చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రగతికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, బ్యాంకులు, సేవా సంస్థలకు కలెక్టర్ కృతికా శుక్లా ధన్యవాదాలు తెలిపారు. అందరి భాగస్వామ్యంతో జిల్లాను ప్రగతి పథంలో మరింత ముందుకు నడిపిద్దామన్నారు. ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్, అర్బన్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జిల్లా ఎస్పీ ఎం రవీంద్రనాథ్‌బాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, అడిషినల్ ఎస్పీలు శ్రీనివాస్, సత్యనారాయణ, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు బీవీ రమణ, జె.సీతారామారావు తదితరులు హాజరయ్యారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. విద్యార్థులకు, ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, సంస్థలకు, వివిధ రంగాల ప్రగతికి కృషి చేస్తున్న ప్రముఖులకు కలెక్టర్, ఎస్పీలు ప్రశంసా పత్రాలను అందజేశారు. 173 మందికి పురస్కారాలు అందజేశారు.



డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు



పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ వేదికగా అంతర్ జిల్లాల బేస్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్ గురువారం తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు రాష్ట్రస్థాయిలో అండర్–14, 17 పోటీలు జరుగుతాయన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెక్లారిన్ స్కూల్ క్రీడామైదానంలో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో వీటిని నిర్వహిస్తారు. 13 జిల్లాల నుంచి బాల బాలికలు పోటీలకు హాజరవుతారు. వివిధ జిల్లాల క్రీడాకారులకు పీఆర్ గర్ల్స్, ఆనందభారతి స్కూల్, గాంధీనగర్ మున్సిపాల్ స్కూల్, బగోడ ఎలిమెంటరీ స్కూల్‌లో వసతి కల్పించారు. పోటీలు 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతాయి. ముఖ్య అతిథిగా ఆర్అండ్‌బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ సిటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరెడ్డి హాజరవుతారు. గురువారం పీఆర్ డిగ్రీ కళాశాల, మెక్లారిన్ గ్రౌండ్లు చదును చేశారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



ఎన్ విజయకుమార్ (అగ్రికల్చర్)



డాక్టర్ రాధాకృష్ణ (వైఎస్సార్ ఆరోగ్యశ్రీ)



డాక్టర్ బి హేమలత (సూపరింటెండెంట్, జీజీహెచ్)



పి రవి (డీపీఆర్వో)



పి.త్రినాథ్ (సీపీవో)

కాకినాడ సిటీ: 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం కాకినాడ జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలో వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన 173 మంది అధికారులు, సిబ్బందికి కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, జేసీ ఇలక్కియ ఉత్తమ అధికారులుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎన్ విజయకుమార్ (అగ్రికల్చర్), డాక్టర్ రాధాకృష్ణ (కో ఆర్డినేటర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ), జి.ప్రసాద్ (ఏపీఈపీడీసీఎల్), డాక్టర్ బి.హేమలత (జీజీహెచ్ సూపరింటెండెంట్), పి.రవి (డీపీఆర్వో), పి.త్రినాథ్ (సీపీవో), కె.హరిప్రసాద్‌బాబు (ఎస్ఈ ఆర్అండ్‌బి), జె.రంగలక్ష్మీదేవి (ఎస్సీ సోషల్ వెల్ఫేర్), డి.రాధాకృష్ణ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్)లకు అందజేశారు. రెవెన్యూ శాఖకు చెందిన 13 మంది, పోలీస్ శాఖకు చెందిన 13 మంది, ఏపీఎస్పీకి చెందిన ఇద్దరు, అగ్రికల్చర్ మూడు, పశుసంవర్ధకశాఖ ఇద్దరు, ఏపీ ఈపీడీసీఎల్ ఇద్దరు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఒకరు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఒకరు, ఏపీ ఆర్టీసీ, ఏపీఎంఎస్ఐడీసీ ఒక్కొక్కరు, బీసీ వెల్ఫేర్ ఇద్దరు, సివిల్ సప్లైస్ ఐదు, కమర్షియల్ టాక్స్ ఒక్కరు, ప్లానింగ్ ఇద్దరు, పంచాయతీరాజ్ ఐదుగురు, డీఆర్‌డీఏ ఇద్దరు, డీడబ్ల్యూఎంఏ ముగ్గురు, విద్యాశాఖ నలుగురు, ఎండోమెంట్, ఫైర్ ఒక్కొక్కరు, ఫిషరీష్ ఇద్దరు, ఫారెస్ట్ ఇద్దరు, హేండ్‌లూమ్, హార్టికల్చర్ ఒక్కొక్కరు, హౌసింగ్ ఇద్దరు, ఐఅండ్‌పీఆర్ ఒకరు, ఐసీడీఎస్ నలుగురు, ఇండియన్ రెడ్‌క్రాస్ ఇద్దరు, ఇరిగేషన్, కుడా, లీగల్ మెట్రాలజీ ఒక్కొక్కరు, మెడికల్ అండ్ హెల్త్ (డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ) ఆరుగురు, జీజీహెచ్ ఇద్దరు, డీసీహెచ్ఎస్ ముగ్గురు, డీఎంహెచ్‌వో నలుగురు, ఎయిడ్స్ కంట్రోల్ ఒకరు, ఆర్ఎంసీ ఇద్దరు, ఎంఏఅండ్‌యూడీ ఎనిమిది, మెప్మా ఒకరు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఒక్కొక్కరు, ఆర్అండ్‌బీ ఇద్దరు, ఆర్‌డబ్ల్యూఎస్ ముగ్గురు, సచివాలయం వీఎస్‌డబ్ల్యూఎస్ ఐదుగురు, సచివాలయం 30 మంది, స్పోర్ట్స్ అథారిటీ ముగ్గురు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఇద్దరు, ట్రాన్స్‌పోర్టు, ట్రెజరీ, ట్రైబల్ వెల్ఫేర్, వికాస ఒక్కొక్కరు, జిల్లా పరిషత్ ఇద్దరు, ఎన్‌జీవోలు ముగ్గురికి అధికారులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

భక్తులతో కిక్కిరిసిన రత్నగిరి



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న నవదంపతులు, భక్తులు

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది భక్తులు
- దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం గురువారం భక్తులతో కిక్కిరిసింది. మాఘమాసం సందర్భంగా తెల్లవారుజామున రత్నగిరిపై వందకుపైగా వివాహాలు జరిగాయి. జిల్లాలోని పలు ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న వారు కూడా స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. నవదంపతులు, వారి బంధుమిత్రులు, స్వామివారి దర్శనానికి విచ్చేసిన సాధారణ భక్తులతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, వ్రతమండపాలు, విశ్రాంత మండపాలు కిటకిటలాడాయి. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ. 25 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. శుక్ర, శనివారాల్లో కూడా ముహూర్తాలు ఉండడంతో రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉంది.



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం దేవస్థానానికి రూ. 9.5 లక్షల విరాళం

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి విజయవాడకు చెందిన దాత చట్రాజుపల్లి వేంకట నాగ సత్యనారాయణ గురువారం రూ.9.5 లక్షలు విరాళంగా సమర్పించారు. వీటిలో సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.4.5 లక్షల విరాళాన్ని చట్రాజుపల్లి కోటిరత్నం, సరస్వతి పేరు మీద అందజేశారు. వీరి పేర్ల మీద ఏటా జనవరి 17న అన్నదానం చేయాలని దాత కోరారు. అలాగే రూమ్ డోనార్ స్కీం కింద రూ.ఐదు లక్షలు విరాళాన్ని సమర్పించారు. ఈ విరాళాన్ని సత్యగిరిపై హరిహరసదన్ సత్రంలో ఒక గదికి కేటాయించి నిబంధనల ప్రకారం దాతలకు సౌకర్యాలను కల్పించాలని కోరినట్లు ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దాత వెంకట నాగసత్యనారాయణ నుంచి విరాళం చెక్కులు స్వీకరిస్తున్న ఏఈఓ కృష్ణారావు

నిద్రలేని రాత్రులెన్నో..



- సుఖంగా నిద్రపోతున్నారా
- పట్టణాల్లో నిద్రలేమి 50శాతం పైనే
- పని ఒత్తిళ్లే ప్రధాన కారణం
- 8 గంటల నిద్రతో సంపూర్ణారోగ్యం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కంటి నిండా కునుకు తీసి ఎన్నాళ్లయిందో.. మనసారా నిద్రపోవడం ఒక కలగా మారింది..ఇప్పుడు ఎక్కువ మంది నోట వినిపించే మాట ఇది. అనారోగ్యానికి కారణమవుతున్న ప్రధాన సమస్య ఇది. పగలంతా రెక్కలు ముక్కలు చేసుకుని రాత్రికి మంచమెక్కినా నిద్ర పట్టడానికి చాలా సమయం పడుతోంది. ఏ తెల్లవారుజామునో నిద్రలోకి జారుకుని రెండు మూడు గంటలకే మేల్కొనాల్సి వస్తోంది. జీవనశైలిలో వచ్చిన మార్పులు ఇందుకు కారణమవు తున్నాయి. అలాగని జీవనశైలిని ఏమైనా మార్చుకుంటున్నారా అంటే అదీ చేయడం లేదు. గాఢ నిద్ర లేక పోవడం ఆరోగ్య పరంగా అనేక అనర్థాలకు దారితీస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పనిలో పెరిగిన ఒత్తిళ్లు, అమెరికా వంటి దేశాలలోని మల్టీనేషనల్ కంపెనీల కోసం నిరంతరం రాత్రి పూట పనిచేయడం నిద్ర లేమికి కారణమవుతూ అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్న వారిలో 50 నుంచి 60శాతం మంది నిద్ర లేమితో బాధపడుతున్నారని వైద్యుల అధ్యయనంలో తేలింది. ఒకప్పుడు గాఢనిద్ర అంటే పది గంటలు పైమాటే. మారిన పరిస్థితులతో నిద్రను అమెరికన్ స్లీప్ అసోసియేషన్ ఎనిమిది గంటలకు కుదించింది.

నిద్రపై ఆరోగ్య ప్రభావం

సుఖమైన నిద్ర పోయే వారు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు పరీక్షల కోసం రాత్రి అంతా చదివేసినా అవి ఒకటి, రెండు రోజులు మాత్రమే గుర్తుంటాయి. ఆ తరువాత మరిచిపోతారు. చదివినంత సమయం నిద్ర కూడా ఉన్నప్పుడే చదువుకున్నది మెదడులో స్థిరంగా ఉంటుంది. పిల్లల్లో .నిద్ర సరిగ్గా లేని వారు పెరగాల్సినంత పెరగక పోవచ్చు.

నీరసం..నిస్సత్తువ

నిద్ర లేమిని వైద్య పరిభాషలో ఇన్‌సామ్నియా అంటారు. దీని బాధితులకు రాత్రి వేళల్లో నిద్ర త్వరగా పట్టకపోవడం, మధ్య రాత్రి వేళల్లో మెలకువ రావడం, త్వరగా లేచి పోవడం, మెదడు పనితీరు క్షీణించడం, నిద్రపోయిన తర్వాత కూడా విశ్రాంతి తీసుకున్న భావన కలగక పోవడం, రోజంతా మత్తుగా ఉండటం జరుగుతుంది. ఫలితంగా నీరసం వచ్చేస్తుంది. పగలంతా శ్రమించిన వారికి, మెదడుకు విశ్రాంతి ఎక్కువగా తీసుకోవాలి. వైద్యులు నిద్రను రెండు రకాలుగా పేర్కొంటున్నారు.

నిద్రలో ఉన్న 1, 2, 3 దశల్లో గాఢ నిద్రలో 2,3 స్టేజ్‌లుగా చెబుతున్నారు. నిద్రలో మూడో స్టేజ్ చాలా కీలకమైంది. ఉదయం నుంచి జరిగే కార్యక్రమాలు ఈ సమయంలోనే మెదడులో నమోదవుతుంటాయి.ఆ సమయంలో సరిగ్గా నిద్ర పట్టలేదంటే ఆరోగ్యంలో సమస్యలు ఎదుర్కొంటున్నట్టేనని గుర్తించాలంటున్నారు. నిద్ర అనేది చిన్న పిల్లల్లో ఎక్కువగా ఉంటుంది. ఏడాది లోపు పిల్లలు 12 గంటలు నిద్రపోతారు. వయస్సు పెరిగే కొద్దీ 8 గంటలు ఉండాలి. యుక్త వయసు నుంచి 50 సంవత్సరాలు మధ్య ఉన్న వారికి మధ్యాహ్నం నిద్ర పోవడం మంచిది కాదు.

నిద్రపోయేందుకు ఇవి పాటించాలి

- నిద్రపోయే ముందు మొబైల్ చూడకూడదు.
- పడకునే గదిలో లైట్ వేసుకోకూడదు.అసలు టీవీ ఉండకూడదు.
- పడుకునే గది కొంత చీకటిగా ఉండాలి.బెడ్ లైట్ కూడా కాంతివంతంగా ఉండకూడదంటున్నారు.
- మధ్య వయస్సు వారు మధ్యాహ్నం పడుకోకూడదు. తిన్న తరువాత పడుకోకపోవడమే చాలా మంచింది.
- బెడ్‌కు ఎదురుగా గడియారం పెట్టుకోవడం, టైం ఎంతయిందని తరచు చూడటం వల్ల నిద్ర లేమికి మరో కారణం.
- ఈ మధ్య కాలంలో నిద్ర లేమితో ఎక్కువ సమస్యలు వస్తున్నాయి. రెండు, మూడు గంటలు, ఐదు గంటలు లోపు నిద్రపోయే వారిలో అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.
- ఇది చాలా ప్రమాదకరం. మెదడుతో పాటు ఇతర భాగాలపై ప్రభావం చూపుతోంది.

నిద్రపోకపోవడం పొగతాగడం కంటే ప్రమాదకరం



పడుకునే ముందు మొబైల్ వినియోగం, ఆన్‌లైన్, ఛాటింగ్‌లు, డ్రగ్స్ వంటివిని తగ్గించాలి. పడుకోవడానికి మూడు గంటలు ముందు కాఫీ, టీ, ఆల్కాహాల్, కూల్‌డ్రింక్ తీసుకోకూడదు. గంట ముందు పాలు తీసుకోవచ్చు. నిద్రపోయేందుకు ముందు వ్యాయామం చేయకూడదు. కొందరు రాత్రి పూట వాకింగ్, వ్యాయామం చేస్తుంటారు. అది ఏమంత మంచిది కాదు. నిద్రపోకపోవడమనేది పొగతాగడం, మద్యం సేవించడం వంటి వాటికంటే ప్రమాదకరంగా పేర్కొంటున్నారు.

– డాక్టర్ పిల్లారిశెట్టి శంకర్, ఎండీ, డీఎన్‌బీ, న్యూరో ఫిజీసియన్, రాజమహేంద్రవరం

నిద్ర మాత్రలతో మతిమరుపు



మానసిక సమస్యలు, యాంగ్జయిటీ, డిప్రెషన్ వల్ల కూడా స్లీపింగ్ డిస్టబెన్స్ ఉంటుంది. అసలు కారణానికి మందులు వాడాలి తప్ప నేరుగా నిద్రలేమికి మందులు వాడకూడదు. ఆల్ప్రాజోలం ఎక్కువగా వాడుతున్నారు. నిద్రకు సమయ పాలన లేకపోవడంతోనే యువతలో నిద్ర లేమి సమస్యలు వస్తున్నాయి. జీవన శైలి మార్చుకుంటే మందులతో పనిలేదు. శ్వాస సంబంధిత ఇబ్బందుల వల్ల కూడా నిద్ర లేమి ఎదురవుతుంది. నిద్రమాత్రల వల్ల మతిమరుపు త్వరగా వస్తుంది. పాలీ సోమినోగ్రాఫీ యంత్రం ద్వారా నిద్ర లేమిని పరీక్షించవచ్చు.

– డాక్టర్ వానపల్లి వరప్రసాద్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్, కాకినాడ

క్లుప్తంగా

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఐ.పోలవరం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పాతయింజరం గ్రామానికి చెందిన కాశి శ్రీనివాస కుమార్ (37) గురువారం పూరిపాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశువుల్లంకలో చెరువుల వద్ద అతను కాపాలాగా ఉంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మన స్థాపానికి గురై చెరువుల దగ్గర కాపాలా ఉంటున్న సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎస్సై రాజేష్ తన సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని భార్య కువైట్‌లో పని నిమిత్తం వెళ్లగా ఇతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం శివారు వంగలపూడి వారి పేటకు చెందిన సవరపు అక్కమ్మ తన మనవరాలు అంజలి(13) ఈనెల 23న ఇంటి నుంచి స్కూలుకు వెళ్లి తిరిగి రాలేదని గురువారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదుచేసింది. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో గురువారం ఆమె ముమ్మిడివరం పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రామికా మేలుకో.. బీమా చేసుకో..

- కార్మికుల కోసం ఈశ్రమ్ పథకం
- సాధారణ నమోదుపై నిర్లక్ష్యం
- దృష్టి సారించిన కార్మిక శాఖ
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 15 లక్షల నమోదు లక్ష్యం


భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

కాకినాడ సిటీ: రెక్కల కష్టంతో జీవించే అసంఘటిత, సంఘటిత రంగాల కార్మికులకు అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ–శ్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులతో పాటు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు సుమారు 15 లక్షలకు పైగా ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకూ 8 లక్షల మంది మాత్రమే నమోదైనట్లు కార్మిక శాఖాధికారులు చెబుతున్నారు. ఈ–శ్రమ్ కార్డు పొందితే వివాహం, విద్య, బాలింత ఖర్చులు, తదితరాల లబ్ధి పొందేందుకు అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

పథకానికి అర్హులు ఎవరంటే..

సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన సుమారు 54 రకాల పనుల్లో పాల్గొనే కార్మికులంతా కార్మిక శాఖ ద్వారా సాయం పొందేందుకు అర్హులు. చిన్న సన్నకారు రైతులు, చర్మశుద్ధి కార్మికులు, కౌలు రైతులు, ఉప్పు, పండ్ల విక్రేతలు, వీధి వర్తకులు, ఇటుక బట్టీలు, బ్రెడ్ కంపెనీ, సిరామిక్స్, హోటళ్లు, గ్యారేజీలు, బిల్డింగ్ వర్కర్లు, ఇండస్ట్రీస్, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు, ఆసుపత్రులు, తదితర రంగాల్లో పనిచేసే రోజువారీ కూలీలు సాధారణ రిజిస్ట్రేషన్‌కు అర్హులు.

సాధారణ రిజిస్ట్రేషన్..

కార్మికులు, కూలీలు రూ.110 చలానాతో మీ సేవ, గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబర్, రెండు పాస్ ఫొటోలతో దరఖాస్తును కార్మిక శాఖ కార్యాలయంలో అందజేయాలి. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిర్ధారించిన తర్వాత గుర్తింపు కార్డులను జారీ చేస్తారు. దీంతో పాటు ఐదేళ్ల పాటు బీమా వర్తిస్తుంది. 16 నుంచి 59 ఏళ్ల వయస్సు లోపువారు పథకానికి అర్హులు. ఏడాది తర్వాత ఆర్థిక సాయానికి అర్హత లభిస్తుంది. రెన్యూవల్ చేసేందుకు రూ. 60 చెల్లిస్తే సరిపోతుంది.

ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు ఇలా..

అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2021 ఆగస్టు 26న ఈ–శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఈ పోర్టల్‌లో కార్మికులు మీ సేవ కేంద్రాల్లోను, గ్రామ సచివాలయాల్లోను నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ విధానంపై అవగాహన ఉంటే సొంతంగానే తమ మొబైల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏడాది పాటు ఎలాంటి ప్రీమియం తీసుకోకుండానే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ. లక్ష ప్రమాద బీమా వర్తిస్తుంది. శాశ్వత అంగవైకల్యం, మృతి చెందినా రూ. 2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ. లక్ష బీమా పరిహారం నామినీకి అందజేస్తారు. ఆదాయ పన్ను చెల్లించని వారు, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం లేనివారు, చిన్న సన్నకారు రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, చిరు వ్యాపారులు, మత్స్యకార, నాయీబ్రాహ్మణ, చేనేత, రజక, డ్రైవర్స్, ఎలక్ట్రీషియన్స్, కల్లుగీత, వడ్రంగి, తదితర కార్మికులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇప్పటివరకూ నమోదు ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లక్ష్యం:	15 లక్షల మంది
తూర్పుగోదావరి జిల్లా:	7,18,295 మంది
కాకినాడ జిల్లా :	42,869 మంది
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా :	1,06,736 మంది

అవగాహన కల్పిస్తున్నాం..



భవన నిర్మాణ, ఇటుక బట్టీలు, ఇతర పనుల్లో పనిచేస్తూ ఈ–శ్రమ్ పరిధిలోకి వచ్చే కార్మికులకు కార్మిక శాఖ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం. బాల కార్మికులతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. కార్మిక శాఖ నుంచి లబ్ధి పొందాలంటే వివరాలు నమోదు చేసుకుని ఉండాలి. మరింత సమాచారానికి నేరుగా కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

–జి.లక్ష్మీనరసయ్య, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్, కాకినాడ జిల్లా

రేపు శ్రీవారి క్షేత్రంలో రథసప్తమి వేడుకలు


శ్రీవారి సూర్యప్రభ వాహనం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో శనివారం రథ సప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అందులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రమంలో ఉత్సవాలకు వినియోగించే సూర్య, చంద్ర ప్రభ వాహనాలను ముస్తాబు చేసే పనులను సిబ్బంది ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ రథసప్తమి వేడుకల్లో పాల్గొనాలని ఈఓ త్రినాథరావు కోరారు.

నేటి నుంచి పొగాకు నెట్‌వర్క్ ప్రాజెక్ట్ సమావేశం

సీటీఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో పనిచేస్తున్న రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ)లో శుక్ర, శనివారాల్లో అఖిల భారత పొగాకు నెట్‌వర్క్ ప్రాజెక్టు సమావేశం నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సీటీఆర్ఐ డైరెక్టర్, అఖిల భారత పొగాకు నెట్వర్క్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశానికి న్యూఢిల్లీ ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (క్రాప్ సైన్స్) డాక్టర్ టీఆర్ శర్మ, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (కమర్షియల్ క్రాప్స్) డాక్టర్ ఆర్‌కే సింగ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని అన్నారు. వివిధ రకాల పొగాకు ప్రాంతీయ నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి ఐసీఏఆర్ ద్వారా గుజరాత్‌లోని ఆనంద్ ప్రధాన కార్యాలయం స్థాపించారని అన్నారు. అనంతరం 1998 ఆగస్టు 16న రాజమహేంద్రవరం సీటీఆర్ఐకి మార్చారని తెలిపారు. పొగాకుపై అఖిల భారత పొగాకు నెట్‌వర్క్ ప్రాజెక్టుగా పేరు మార్చి సీటీఆర్ఐ డైరెక్టర్ పరిపాలనా నియంత్రణలో ఉంచారన్నారు. ఉత్పాదకత, నాణ్యతను పెంపొందించడానికి వివిధ పొగాకు రకాలపై పరిశోధన సమన్వయం చేయటం, అధిక దిగుబడి సామర్థ్యం, బహుళస్థాయి క్షేత్ర పరిశీలకులు, ఆయా ప్రదేశాల ప్రమాణాలతో పొగాకు ఉత్పత్తి, సస్యరక్షణ పద్ధతుల పరిజ్ఞానాన్ని నిర్దిష్టపరచడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో 14 కేంద్రాల నుంచి వివిధ విభాగాల శాస్త్రవేత్తలు పాల్గొని గత సంవత్సరంలో జరిగిన పరిశోధన ఫలితాలను వివరించడం, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలను ఖరారు చేస్తారన్నారు. పొగాకు పరిశోధనలలో నిష్ణాతులైన డాక్టర్ ఆర్.లక్ష్మీనారాయణ, డాక్టర్ వీఆర్ఎం రావు, డాక్టర్ జేఏవీ ప్రసాదరావు, డాక్టర్ యు.శ్రీధర్‌లు టెక్నికల్ సెషన్స్‌కు అధ్యక్షత వహిస్తారని వివరించారు. సమావేశాల సందర్భంగా సంబంధిత సాంకేతిక ప్రచురణలు, కరపత్రాలు, సీడీలు అతిథుల ద్వారా రైతు ప్రయోజనార్థం విడుదల చేస్తామని శేషుమాధవ్ తెలిపారు.

శ్రీపాద శ్రీవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు


శ్రీపాద శ్రీవల్లభ స్వామి ఆలయంలో భక్తులు


ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

పిఠాపురం: స్థానిక శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో వేంచేసిన శ్రీపాదశ్రీవల్లభ స్వామి వారి 703వ ఆవిర్భావ ఉత్సవాలు రెండో రోజు గురువారం కనుల పండువగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి దర్శనానికి బారులు తీరడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు ఆధ్వర్యంలో స్వామి వారికి పల్లకీలో గ్రామోత్సవం, గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.


స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వీరేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు శివైక్యం


యనమండ్ర వీరేశ్వరశర్మ (ఫైల్)

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో సుమారు 80 ఏళ్లు విశేష సేవలందించిన యనమండ్ర వీరేశ్వరశర్మ (వాగ్మి) బుధవారం రాత్రి శివైక్యం పొందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, 9 మంది కుమార్తెలు ఉన్నారు. ఆలయ అభివృద్ధికి వీరేశ్వరశర్మ విశేష కృషి చేశారు. ప్రస్తుతం వీరి కుమారులు సుబ్బారావు, సత్య సీతారామశర్మ (రాష్ట్ర ఆదిశైవ సంఘ అధ్యక్షుడు) అర్చకత్వం నిర్వహిస్తున్నారు. వీరేశ్వరశర్మ మృతికి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, కొలిశెట్టి గంగబాబు, ఈఓ లక్ష్మీనారాయణ సంతాపం తెలిపారు.

గిరిజన పక్షపాతి సీఎం జగన్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గిరిపుత్రుల ఆరాధ్య దైవంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వడిత్య సోమశంకర్ నాయక్ అన్నారు. కాకినాడ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యంగా గిరిజన ప్రాంతాలకు అన్ని విధాలా సహకరిస్తున్నారన్నారు. గిరిజనుల పక్షపాతిగా సీఎం నిలుస్తారని, తండ్రిని మించిన తనయుడిగా మంచి పాలన అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి పరిపాలనా వికేంద్రీకరణతో సాధ్యమని, మూడు రాజధానులతో రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆదివాసీలకు మేలు జరుగుతుందన్నారు.

ఆకట్టుకున్న ఇండియా గేట్ నమూనా


హసన్‌బాదలో ఇండియా గేట్ నమూనా వద్ద విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్ జి.శ్రీను ఆధ్వర్యంలో ఇండియా గేట్ నమూనాను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇది అందరినీ ఆకట్టుకుంది. ఈ నమూనా వద్ద జాతిపిత మహాత్మాగాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. ఇండియా గేట్ నమూనాను అద్భుతంగా ఆవిష్కరించిన శ్రీనును పలువురు అభినందించారు.

హేవలాక్ బ్రిడ్జికి ఆర్నమెంటల్ లైటింగ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్


వేడుకను తిలకించేందుకు వచ్చిన ప్రజలు


హేవలాక్ వంతెనపై లైటింగ్

ప్రారంభించిన ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో వందేళ్ల పైబడిన ప్రతిష్టాత్మక హేవలాక్ బ్రిడ్జి గురువారం రంగురంగుల విద్యుద్దీపాలతో ప్రత్యేక కాంతులీనింది. రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం ఎంపీ మార్గాని భరత్‌రామ్ దీనికి ప్రారంభోత్సవం చేశారు. రుడా, నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ బ్రిడ్జిని ఆధునీకరణలో భాగంగా ఆర్నమెంటల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో లైటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వచ్చే ఏడాది రిపబ్లిక్ డే వేడుకల నాటికి రాజమహేంద్రవరం మరింత సుందర నగరంగా మారబోతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అందుకు తగ్గట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత, నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ నగర సర్వముఖాభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిచేలా తామంతా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. హేవలాక్ బ్రిడ్జిని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, కమిషనర్ దినేష్‌కుమార్, కాకినాడ జేసీ ఇలక్కియ, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ ప్రవీణ్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

అర్తమూరులో వైభవంగా శోభాయాత్ర


శోభాయాత్ర నిర్వహిస్తున్న బులిస్వామిరెడ్డి తదితరులు

మండపేట: శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారికి ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్ అవార్డు రావడం పట్ల ఆయన స్వస్థలమైన మండపేట మండలం అర్తమూరులో గురువారం వేడుకలు నిర్వహించారు. ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి శోభాయాత్ర జరిగింది. గ్రామస్తులు చినజీయర్ స్వామివారి ఫొటోలతో హర్షాభినందన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ ఇరువురు జీయర్లను అందించి తమ గ్రామం దేశవ్యాప్తంగా ఖ్యాతినార్జించిందన్నారు. దేశ విదేశాల్లో హిందూ ధర్మ పరిరక్షణకు ఎనలేని కృషి చేస్తున్న చినజీయర్ స్వామివారి సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మభూషణ్ అవార్డును అందజేయడం అభినందనీయమన్నారు.

విద్యార్థిపై పిచ్చికుక్క దాడి


పిచ్చికుక్క కాటుకు గురైన రాజశేఖర్

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల కుసుమ రాజశేఖర్‌పై గురువారం పిచ్చికుక్క దాడి చేసింది. రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొని ఇంటికి తిరిగి వెళ్తున్న రాజశేఖర్ ఎడమ చేయి కండను కొరికి లాక్కుపోయింది. కుక్క కాటుకు గురై విలవిల్లాడుతున్న విద్యార్థిని స్థానికులు నగరం పీహెచ్‌సీకి తీసుకు వెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేసిన అనంతరం చేతికి కుట్లు వేశారు.